# కీలకోపన్యాసం:

వేమూరి వేంకటేశ్వరరావు

చిట్టెన్‌రాజు గారు నన్ను ఈ కీలకోపన్యాసం ఇమ్మని అడిగినప్పుడు నేను - నేరకపోయి -

"అయ్యా! ప్రసంగం ఎంత పొడుగు ఉంటే బాగుంటుందండీ" అని అడిగేను.

"ఎ కీనోట్ స్పీచ్ షుడ్ బి లైక్ ఎ ఉమన్స్ స్కర్ట్. ఇట్ షుడ్ బి లాంగ్ ఎనఫ్ టు కవర్ ద ఇంపార్టెంట్ పోయింట్స్, బట్ షార్ట్ ఎనఫ్ టు బి ఇంటరెస్టింగ్" అని అన్నారు.

పులుపు చచ్చినా చింత చచ్చినట్లు లేదు!

బాగానే ఉంది! -- "ఏ విషయం మీద మాట్లాడమంటారు?"" అని అడిగేను.

"మనం ఇరవైయవ శతాబ్దం వదలి ఇరవై ఒకటవ శతాబ్దంలో అడుగు పెట్టేం కదా. కనుక గత శతాబ్దంలో మన సాహిత్యం

ఎలా పరిణతి చెందింది? ఏమిటి సాధించింది? ఈ శతాబ్దంలో ప్రవాసాంధ్రులమైన మనం తెలుగు సాహిత్యానికి ఏవిధంగా దోహదం చెయ్యగలం? అన్న విషయాల గురించి టూకీగా ఒక అరగంట లోపుగా తెమల్చండి." అన్నారు.

గోడలో ఒక చిన్న బెజ్జం ఉందనుకోండి. దాన్ని పూడ్చ వలసి వచ్చినప్పుడు దాన్ని కొంచెం పెద్దది చేసి, ఆ పెద్దదాన్ని మరమ్మత్తు చెయ్యడం తేలిక. అలా గత శతాబ్దంలో మన సాహిత్యం గురించి మాట్లాడ వలసి వచ్చినప్పుడు దాని పరిధిని కొంచెం పెంచి మాట్లాడడం తేలిక. కాని దీనంతటినీ అరగంటలో ఇమడ్చడం అంటే మాటలా?

అయిదు రోజుల పెళ్ళిళ్ళనే అరగంటలో తెమిల్చేస్తున్న ఈ రోజుల్లో ఈ ఉపన్యాసం అరగంటలోకి ఎందుకు ఇమడ్చ లేం? చూద్దాం!

బందరులో, 1954 లో ఇంటరు అయిన తర్వాత అమెరికాలో, 1968 లో, పి.హెచ్.డీ. పట్టా పుచ్చుకునే వరకూ – 14 ఏళ్ళ

పాటు – తెలుగుకీ నాకూ సంబంధం అంతంత మాత్రమే. తెలుగు సాహిత్యం దృష్ట్యా ఈ 14 ఏళ్ళూ అరణ్య వాసమే!

కాకినాడలో ఇంజనీరింగు చదివిన నాలుగేళ్ళూ-- తీరుబడంటూ దొరికితే -- శవ సాహిత్యం తెగ చదివేవాడిని. డిటెక్టివ్ వాలి, యుగంధర్, ఇన్స్పెక్టర్ వేణు ... వీళ్ళే నా హీరోలు.

భిలాయ్‌లో ఉద్యోగం చేసిన మూడేళ్ళూ -- అవసరం కొద్దీ రష్యన్, హిందీ నేర్చుకునే హడావిడిలో తెలుగుకి చోటేదీ!

1961 లో మన దేశం వదలి అమెరికా వచ్చేను.

అమెరికాలో ఉన్న మొదటి ఏడేళ్ళూ తెలుగు పుస్తకాన్ని చదివిన పాపాన్న పోలేదు.

కనుక ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యం గురించి నాకు తెలిసినది చాల తక్కువ.

తెలుగు సాహిత్యంతో నాకున్న బహు కొద్ది పరిచయం ఎలాంటిదో ఒక్క సారి సింహావలోకనం చేసి చూపిస్తాను.

హైస్కూలు లోను, కాలేజీ లోను నేను చదివిన పాఠ్యభాగాలు -- నన్నయ, నన్నెచోడుడు, తిక్కన, పోతన, శ్రీనాధుడు, ఏనుగు లక్ష్మణ కవి, పరవస్తు చిన్నయ సూరి, తిరుపతి వెంకట కవులు. పింగళి సూరన్న కళాపూర్ణోదయంలో కలభాషిణి ఉయ్యాలలో ఊగుతూన్న దృశ్యాన్ని వర్ణించే పద్యాలు మా అక్క చదువుతూ ఉంటే విన్నాను.

బందరులో, విశ్వనాథ సత్యనారాయణ గారు కల్పవృక్షంలో పద్యాలు స్వయంగా చదివి వినిపించి, అర్థం చెబుతూ ఉంటే విన్నాను. సభలో కుదురుగా కూర్చోలేదని ఆయన చేత చివాట్లు కూడ తిన్నాను!

బాపిరాజు, బుచ్చిబాబు, గోపీచంద్, చలం, శ్రీశ్రీ, ... పేర్లు విన్నాను కానీ చదవలేదు; కొడవటిగంటి కుటుంబరావు కథలు చదవలేదు.
రావి శాస్త్రి, ... పేరు – మొదటి సారి – ఆయన చచ్చిపోయే ముందు విన్నాను.

ముళ్ళపూడిని చదివేను.

మాలతీచందూర్‌ని చదివేను.

మా అన్నయ్యలు 1950 లలో పుంఖాను పుంఖాలుగా రాసిన కథలు ఆనందవాణి, వినోదిని, చిత్రగుప్త, స్వతంత్ర, ఆంధ్రపత్రిక, భారతి మొదలైన పత్రికలలో అచ్చయేవి. అవి చదివేవాడిని.

మా ఊరు వాడు -- ఈరంకి వెంకట్రావు రాసిన కథలు చదివేను.

మా ఊరు వాడు -- అవసరాల రామకృష్ణారావు రాసిన కథలు చదివేను.

పెద్దవాళ్ళు చూడకుండా -- బెంగాలీ నుండి తెలుగు లోకి తర్జుమా అయిన మాయావి, మాయావిని, మనోరమ; వాడేవీడు, నేనే, కాలూరాయ్ వగైరాలు చిత్తుగా చదివేననుకొండి.

అంతే...

ఏదో సుడి తిరిగింది! అమెరికా వచ్చి పడ్డాను.

అప్పట్లో అమెరికాలో ఇండియన్ ముఖాలు తక్కువ.

కనుక ఇక్కడి వాళ్ళకి నేనొక వింత. మన గురించి ఎన్నో ప్రశ్నలు వేసేవారు. చాల మట్టుకి చచ్చు ప్రశ్నలు. కొన్ని చొప్పదంటు ప్రశ్నలు.

మరి కొన్ని చిరాకెత్తించే ప్రశ్నలు.

నా గురించి కాని, తెలుగు దేశం గురించి కాని, భారతదేశం గురించి కాని నాకు తెలిసినది బండి సున్న! నేను వీళ్ళకి ఏమి సమాధానం చెప్పగలను? చేతకానప్పుడు చిరాకెత్తక ఏం చేస్తుంది?

అప్పుడు మొదలు పెట్టా, నా గురించి అన్వేషణ. పాఠ్య పుస్తకాలు పక్కన పెట్టి మా యూనివర్శిటీ లైబ్రరీలో దొరికిన రాధాకృష్ణన్, వివేకానంద, నెహ్రూ, గాంధీ, లిన్ యూటాంగ్,..., ఇలా మన దేశం గురించి ఎక్కడ ఏ పుస్తకం దొరికినా చదవడం మొదలు పెట్టా. అన్నీ ఇంగ్లీషులో రాసినవే! అన్నీ భారత దేశం గురించే, తెలుగు గురించి కాదు.

ఈ అన్వేషణ కుంటుతూ, మెక్కుతూ కొన్నేళ్ళ పాటు జరిగిన తర్వాత --

నేను పి. హెచ్. డి. థీసిస్ రాస్తూన్న రోజులలో – 1968 లో – మా ఇంటికి భోజనానికి వచ్చిన ఒక తెలుగు కుర్రాడితో వాదన వచ్చింది.

"తెలుగు స్ట్రక్చరల్‌గా చాలా వీక్. తెలుగులో సైన్సు రాయడం కుదరదు" అన్నాడు. ఎడ్డెం అంటే తెడ్డెం అనే కుర్ర వయస్సది. అతను కుదరదన్నాడు కదా అని నేను "కుదురుతుంది" అన్నాను తప్పితే నాకు తెలుగులో ప్రావీణ్యం ఉండి ఏడిసి కాదు. ఇద్దరం గొంతు చించుకున్నాం. కొట్టుకున్నంత పని చేసేం.

ఆ కోపంలో డిజర్టేషన్ కి ఇప్పుడు తొందరేమొచ్చిందిలే అనుకున్నాను. ముందు ఏదో ఒక సైన్సు విషయం తెలుగులో ఒక పేజీ రాసి చూపిద్దాం అన్న పట్టుదల పుట్టింది.  నాకు తెలుసున్నది కంప్యూటర్ల గురించి. అందుకని "కంప్యూటర్లు ఎలా పనిచేస్తాయి?" అన్న అంశం తీసుకుని రెండే రెండు పేజీల వ్యాసం  రాసి చూద్దామనిపించింది.  నెల తిరిగే లోపల రెండు వందల పేజీలు రాసేను. క్లుప్తత నా సుగుణాలలో ఒకటి కాదు!

మా అమ్మకి ఉత్తరం రాయడం తప్ప అంతవరకు తెలుగులో పెద్దగా ఏమీ రాయలేదు.  అలాంటి నేను రాసిన ఆ రెండు వందల పేజీలని ఏమిటి చెయ్యడం? కట్ట కట్టి క్లాజెట్‌లో పడేసేను.

తర్వాత, కాకతాళీయంగా పెమ్మరాజు వేణుగోపాలరావు, గవరసాన సత్యనారాయణ ప్రభృతులు తెలుగుభాషా పత్రిక స్థాపించడం, దాంట్లో వారు నా చిత్తు ప్రతిని కొద్దిగా "ఎడిట్" చేసి, ధారావాహికగా మూడేళ్ళపాటు ప్రచురించడం - చకచకా జరిగిపోయేయి.

అయ్యా అదీ నేను తెలుగులో రాసిన మొదటి రచన.  ఇది కథ కాదు, కవిత కాదు. నవల కాదు. "సాహిత్యం" అనే మాట యొక్క నిర్వచనంలో ఇమడదు. కాని అది నాకు బాగా తెలిసిన విషయం మీద తెలుగులో రాసిన రాత. ఇంగ్లీషు ఊత పదాలు లేకుండా, వ్యావహారికంలో రాసిన రాత.

చదివిన వాళ్ళందరూ "చాలా" బాగుందన్నారు. అది భట్రాజు పొగడ్త కాదనుకొని ఉబ్బి పోయాను. హనుమంతుడికీ నాకూ ఉన్న కొన్ని పోలికలలో "ఉబ్బి పోవడం" ఒకటనుకుంటాను!

అప్పుడు -- తెలుగంటే కొంచెం ఉత్సాహం పుట్టింది.

కొంచెం పరిశ్రమ చేసేను. పరిశోధన చేసేను. నేను కనిపెట్టినదేమిటయ్యా అంటే....

1. మన ఆంధ్ర రాష్ట్రం ప్రపంచంలోని ఎన్నో దేశాల కంటె పెద్దది - ఒక్క వైశాల్యం లోను, జనాభా లోనూ మాత్రమే కాదు! చరిత్రలోనూ, మనం సృష్టించిన సారస్వతంలోనూ కూడ!!

2. తెలుగు జాతి చరిత్ర బహు ప్రాచీనమైనది. భారత యుద్ధంలో తెలుగు వారు కూడ పోరాడేరట - కౌరవుల తరఫున!

3. ఐతరేయ బ్రాహ్మణ కాలం నాటికే తెలుగు జాతి తన విశిష్టతని రూపొందించుకొందిట.

4. శాతవాహనుల నుండి తంజావూరు నాయక రాజుల వరకు – ఎంతో మంది ప్రభువులు పోషించగా, పరిషత్తులు ఆదరించగా -- తెలుగు సాహితీ సంస్కృతులు వెయ్యేళ్ళకు పైగా వెల్లివిరిసి వర్ధిల్లుతూ వచ్చేయి.

5. సంగీత, నృత్య, నాటక, శిల్ప కళలలో తెలుగు కళాకారులు కీర్తి శిఖరాలు అధిరోహించేరన్నది నిర్వివాదం.

6. కలం పట్టినా, హలం పట్టినా,..... గజ్జె కట్టినా, కుంచె కదిపినా, .... గళమెత్తినా ... కమనీయ, రమణీయ దృశ్యాలని సాక్షాత్కరింపజేసేరు – మన వాళ్ళు!

7. కాని ఈ సృజన, ఈ చైతన్యం బలీయమైన కాలప్రవాహంలో కొట్టుకుపోయింది. భారత దేశంతో పాటు తెలుగు దేశం కూడ నిద్రావస్థలో మునిగి పోయింది.

ఉదాహరణకి, నన్నయ రోజులనుండి నేటి వరకు ఉన్న తెలుగు సాహిత్యాన్ని ఒక్క విహంగవీక్షణం చేసి చూద్దాం. పదకొండో శతాబ్దం నుండి 17 శతాబ్దం వరకు ఉన్న మధ్య కాలంలో ఒక్క

వెలుగు వెలిగించిన మహాకవులు – కొంచెం ఇటూ అటూగా – 18 మంది!

నన్నయ, నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, తిక్కన, మాచన, ఎఱ్ఱాప్రగడ, నాచన సోమనాథుడు, శ్రీనాథుడు, పోతన, అన్నమయ్య, పెద్దన, కృష్ణదేవరాయలు, తిమ్మన, ధూర్జటి, తెనాలి రామకృష్ణ, పింగళి సూరన, అప్పకవి, క్షేత్రయ్య!

పోనీ లెక్క పెట్టడానికి వీలుగా ఏడు శతాబ్దాలలో 21 మంది కవులు అనుకుందాం. అంటే ఉరమరగా శతాబ్దానికి ముగ్గురు చొప్పున పుట్టేరు. లేదా తరానికి ఒకొక్కడు!! పరవా లేదు!!!

తర్వాత దరిదాపు రెండు శతాబ్దాల పాటు తెలుగు సాహిత్యంలో చెప్పుకోదగ్గ సృజన జరగలేదనే చెప్పాలి – ఒక్క త్యాగయ్య మినహా!

"మా తాతలనాడు నేతులు తాగేం, కావలిస్తే మా మూతులు వాసన చూసుకోండి", అనే స్థితికి దిగజారిపోయేం.

ఒక ఆంగ్లేయుడు మన భాష నేర్చుకుని, మన భాషకి ఒక నిఘంటువు నిర్మించ వలసిన గతి పట్టింది.

ఇరవైయవ శతాబ్దపు పూర్వార్ధంలో ప్రవేశించేం.

చెప్పుకోదగ్గ మార్పులు ఏమిటయ్యా అంటే గ్రాంధిక భాష బిగపట్టు నుండి విడిపించుకుని వ్యావహారికంలో రాయడం మొదలు పెట్టేం. ఛందో బంధాల బందోబస్తు నుండి బయట పడి కొత్త రకం కవిత్వం కూడ రాయడం మొదలు పెట్టేం.

కథా వస్తువుని ఇతిహాస, పురాణాల నుండి దిగుమతి చెయ్యడం తగ్గించి సామాజిక స్పృహ తోటీ, రాజకీయ చైతన్యపు "ఇజా"లని ప్రతిబింబిస్తూ కొత్త కొత్త పోకడలకి ఒరవడి చుట్టేం. పాశ్చాత్య సాహిత్యాల ప్రభావం మన సాహిత్యం మీద పడడం మొదలు పెట్టింది. నవలలు, కథానికలు, వ్యాసాలు, గల్పికలు, గేయాలు మొదలైన సృజనలు తెలుగులో రావడం మొదలు పెట్టేయి. చెదురు మదురుగా ఆధునిక వైజ్ఞానిక విషయాలని కూడ తెలుగులో రాయడం మొదలు పెట్టేం.

గురజాడ, కందుకూరి, విశ్వనాథ, బాపిరాజు, కరుణశ్రీ, జాషువా, కొమర్రాజు, గోపీచంద్, బుచ్చిబాబు, శ్రీశ్రీ, ...., మొదలైన వాళ్ళు తెలుగు బావుటాని పైకెగరెయ్యడం మొదలెట్టేరు. సృజనాంకురాలు మొలకెత్తుతున్నాయనీ, ఇదొక వటవృక్షంలా విస్తరిస్తుందనీ భ్రమ పడ్డారు చాల మంది.

ఇంతలో స్వతంత్రం వచ్చింది! తర్వాత పులి మీద పుట్రలా తెలుగు రాష్ట్రం వచ్చిపడింది!! మన పుట్టి మునిగింది!!!

తెలుగువారు గద్దె ఎక్కడం భాష పునరుజ్జీవనానికి నాంది అని ఆశ పడ్డవారికి ఆశాభంగమే అయింది. తెలుగు వారి ఆధ్వర్యంలో తెలుగు భాష పట్ల సాగిన కృషి నామమాత్రమే.

తెలుగు వారి అజమాయిషీలోనే తెలుగు భాష దయనీయమైన స్థితికి దిగజారిపోయింది. ఈ దిగజారుడు ప్రభావం పాఠ్యపుస్తకాలలోనూ, చలనచిత్ర సాహిత్యంలోను కూడా కనిపించడం మొదలు పెట్టింది. "ఈ పరిస్థితికి ఎందుకిలా దిగజారిపోయాము?" అని మీరు నన్ను నిలదీసి అడిగితే దానికి సరైన సమాధానం నా దగ్గర లేదని మనవి చేసుకుంటున్నాను.

దీని ఫలితం ఏమిటంటే -- తెలుగు దేశంలో, తెలుగు దేశపు రాజధానిలో, తెలుగు  ప్రజల నోట -- తెలుగు మాట వినబడడం లేదు.  హైదరాబాదు మాట అటుంచి, విశాఖపట్నంలో ఉన్న నా మేనళ్ళుళ్ళు, మేనగోడళ్ళు తెలుగు మాట్లాడగలరు కాని రాయలేరు, చదవలేరు.

ఆంధ్రప్రదేశ్ అవతరించిన తర్వాత -- తెలుగు వాళ్ళే తెలుగుని చంపేస్తున్నారని మనవి చేసుకుంటున్నాను.

అమెరికాలో దుమారంలా రేగిన డాట్ కామ్ ప్రభంజనపు గాలులు ఆంధ్రదేశపు పొలిమేరలని తాకగానే -- తెలుగు మీద అభిమానం ఉన్నవాళ్ళకి కూడ తెలుగు నేర్చుకోవలసిన అవసరం కనిపించ లేదు.  ఏదో అవక తవకగానైనా సరే ఇంగ్లీషు వస్తే విస్తట్లో వడ్డనకి ఉపాధి ఉంటుంది కాని తెలుగు కూడు పెడుతుందా, గుడ్డ పెడుతుందా అన్న "మనోవికాశం" చాల మందిలో కలిగినట్లుంది. తెలుగు దేశంలోనే తెలుగు భవిష్యత్తు -- తైలం నిండుకున్న దీపంలా -- రెపరెపలాడడం మొదలు పెట్టింది.

తెలుగు పరిస్థితి ఇలా దిగజారిపోతూ ఉంటే సర్వులూ ఉదాసీన భావంతో ఉపేక్షించి ఊరుకోలేదు.

ఆంధ్రప్రదేశ్ అవతరణ, తెలుగు భాష పతనానికి ప్రారంభోత్సవం,.... దరిదాపు ఒకే సారి జరిగేయి అని మనవి చేసుకున్నాను కదా. ఈ పతనం ప్రారంభమైన దశలోనే - కేవలం కాకతాళీయంగానే అనుకొండి - తెలుగు దేశం నుండి యువతీ యువకులు అమెరికా, ఆస్ట్రేలియా మొదలైన సంపన్న దేశాలకి వలస వెళ్ళడం మొదలు పెట్టేరు. మొదట ఉన్నత విద్యకోసం బిందు ప్రమాణంలో మొదలైన ఈ వలస ఉద్యోగాన్వేషణ రూపంలో క్రమేపీ సింధు ప్రమాణం దాల్చింది. ఇలా వలస వచ్చిన వాళ్ళల్లో చాల మంది వైద్య, విజ్ఞాన, సాంకేతిక, వ్యాపార రంగాలకి చెందిన వారే కాని తెలుగు పండితులు, కవులు, కథకులు కారు.

కాని --- తెలుగు దేశపు పొలిమేరలు దాటిన నాటి నుండి ఈ యువతీ యువకులకి తెలుగు భాషపై మమకారం పెరిగిందనడంలో అతిశయోక్తి లేదు. తెలుగు దేశంలో తెలుగు కృష్ణపక్ష చంద్రుడిలా క్షీణిస్తూ ఉంటే -- ప్రవాసాంధ్రులలో

తెలుగు జాతంటే గర్వం, తెలుగు భాషంటే అభిమానం శుక్లపక్ష చంద్రుడిలా వృద్ధి పొందుతూ వచ్చేయి.

అభిమానంతో పాటు సంకల్పాలని ఆచరణలో పెట్టడానికి ఆర్థిక స్థోమత కూడ ఉండడంతో ఉత్తర అమెరికాలో తెలుగు భాషకి సేవ చెయ్యడానికి నడుం కట్టుకున్న స్వచ్ఛంద సంస్థలు ఎన్నో వెల్లివిరిసేయి. ఈ రోజు కార్యక్రమానికి దక్షులైన వంగూరి సంస్థ, న్యూయార్క్, న్యూజెర్సీ, డెలవేర్ వేలీలలో ఉన్న ప్రాంతీయ తెలుగు సంస్థలే కాకుండా, సిలికాన్ ఆంధ్రా, ఆటా, తానా,...., వంటి ఎన్నో సంస్థలు "తెలుగుతనం" నిలబెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాయి.

కాని "ఆంధ్రానాం అనేకత్వం" అన్న నానుడిని సమర్థిస్తూ ఈ వివిధ సంస్థల మధ్య పరస్పర సహకారానికి, సమన్వయానికి అనుగుణమైన యంత్రాగం లేకపోవడం వల్ల ఆశించిన రీతిలో పనులు సాగడంలేదు; ఆశయాలు నెరవేరడం లేదు. అమెరికాలోని ఈ సంస్థలు సాగించే కార్యక్రమాలు సార్వత్రికంగా, స్థాయిపరమైన ఆమోద ముద్రను పొందలేకపోతున్నాయి. ఈ వివిధ సంస్థల మధ్య పరస్పర

సహకారానికి, సమన్వయానికి అనుగుణమైన యంత్రాగం లేకపోవడం వల్ల ఆశించిన రీతిలో పనులు సాగడంలేదు; ఆశయాలు నెరవేరడం లేదు.

చిన్న ఉదాహరణ. కంప్యూటరీకరణ విషయమే తీసుకుందాం. ఈ రంగంలో ప్రావీణ్యత ఉన్న ఔత్సాహికులు కలనయంత్రాలలో వాడడానికి అనువుగా తెలుగుని మలచడానికి ఉడతాభక్తిగా కృషి చేస్తున్నారు. తెలుగు ఫాంట్లు తయారు చెయ్యడం, "రిట్" పద్ధతి ఉపయోగించి రోమన్ లిపిలో తెలుగు రాయడం, ఈ సంకేత లిపిలో రాసిన దానిని తెర మీద తెలుగు లిపిలో కనిపించేలా చెయ్యడం, ఈ ఫైలుని పి. డి. ఫ్. లోకి మార్చడం, ఇలాంటి సదుపాయాలెన్నో ఔత్సాహికుల కృషి యొక్క ఫలితాలే.

ఆంధ్రదేశంలో - ప్రభుత్వం వారిచ్చిన "గ్రేంటు" డబ్బులతో - ఇటువంటి కృషి జరుగుతున్నా, అమెరికాలో ఔత్సాహికులు కేవలం సొంత డబ్బులతో జరిపిన కృషి ఫలితాలే ఎక్కువ జనాదరణ పొందడం గమనార్హం. ఈ పునాదుల మీద

నిర్మించిన "ఈ-పత్రికలు" ప్రపంచ వ్యాప్తంగా విశేషమైన ఆదరణ పొందడమే ఈ గమనికకి రుజువు.

అయినా -- ఈ కంప్యూటరీకరణ విషయంలో -- అన్ని సందర్భాలలోనూ, ఒకే ఒక వ్యక్తి -- ఒక "ఆర్టిసాన్" , తన గదిలో కూర్చుని - మరొకరి ప్రమేయం లేకుండా - సృజనావ్యాపారం కొనసాగించడం జరిగింది తప్ప నలుగురైదుగురు చేతులు వేసి, కలిసికట్టుగా, ఒక ప్రణాళికా బద్ధంగా చేసిన పని కాదిది. గడ్డి పరకలు కూడ పెంటిగా ఏర్పడి మదపుటేనుగుని బంధించినట్లే సంఘీభావంతో నలుగురూ నాలుగు చేతులు వేసి చేస్తే ఇంకా ఎన్ని పనులు జరుగుతాయో!

ఈ ప్రసంగాన్ని పరిసమాప్తి చేసే లోగా ఈ దేశంలో భాషాసేవ చేస్తూన్న సంస్థల యెడల కొన్ని గమనికలు --

1. ఈ దేశంలో పేరు పడ్డ పెద్ద సంస్థలు - తానా, ఆటా. వీరి పేరులో తెలుగు ఉంది కాని వీరి ధ్యేయం తెలుగు భాషని ఉద్ధరించడం అని నేను అనుకోను. సిలికాన్ ఆంధ్రా వారు

తెలుగు కట్టు, బొట్టు, ఆట, పాటలతో పాటు భాషకి కూడ కొంత ప్రాధాన్యత ఇస్తున్నారు. తెలుగు భాషకే ప్రాధాన్యత ఇచ్చినది వంగూరి వారి సంస్థ; కాని వీరి దగ్గర డబ్బులు లేవు. అయినా సరే వీరు జాతీయ స్థాయిలో నాలుగు సదస్సులు జరిపేరు, 24 పుస్తకాల వరకూ ప్రచురించారు. అమెరికాలో ఉన్న తెలుగు రచయితల రచనలకే పరిమితం కావడం వల్లనో ఏమో, రాసి లోనూ, వాసి లోనూ, వైవిధ్యత లోనూ వీటి స్థాయి బాగా ఎదగవలసిన అవసరం ఉందేమో అని అనిపిస్తుంది.

2. ఆటా, తానా సంస్థలు చేసే పనులన్నీ బేరీజు వేసి చూస్తే వాటి గమ్యంలో తేడా ఉన్నట్లు కనిపించదు. వీరు పత్రిక నడిపితే వారూ నడుపుతున్నారు. వీరు నవలల పోటీ పెడితే వారూ పెడుతున్నారు. ఒకరు అష్టావధానం నడిపిస్తే మరొకరు కనీసం – ప్రయోగం పేరిట – నవావధానమైనా నడిపించడం లేదు; వారూ అష్టావధానమే! ఒకరి ఫార్ములా మరొకరు కాపీ చేస్తున్నారు తప్ప కొత్త పుంతలు తొక్కడం కనిపించదు. మన డబ్బులు మనం ఖర్చు పెట్టుకుంటూన్నప్పుడు,

లాభాపేక్ష లేనప్పుడు, కొత్త కొత్త పుంతలు తొక్కి – ఒకరు ఒక రంగంలోనూ, మరొకరు మరొక రంగం లోనూ –పరిశ్రమ చేసి విశిష్టత పొందొచ్చు కదా?

3. ఇక నవలల పోటీలు చూద్దాం. రేగడి విత్తులు 1.25 లక్షలు గెలుచుకున్న తర్వాత పోటీకి వచ్చిన నవలలు చాల మట్టుకి రేగడి విత్తుల "ఫార్ములా"ని ఏదో ఒక విధంగా అనుకరించినట్లే కనిపిస్తాయి – నా దృష్టిలో. ఏటేటా ఈ నవలల పోటీలు పెట్టేసి లక్షేసి రూపాయల బహుమతులు ప్రకటించేసినంత మాత్రాన మంచి నవలలు పుట్టుకొస్తాయా అన్నది లక్షరూపాయల ప్రశ్న. మంచి సామాజిక స్పృహ ఉండే ఆధునిక నవలకి కావలసింది ఫార్ములా కాదు – పరిశోధన! వైవిధ్యత!!

4. నవలల పోటీ, కథల పోటీల యెడల మరొక గమనిక. అందరూ "కథా వస్తువు తెలుగు జీవితానికి సంబంధించినదై ఉండాలి" అని ఒక నిబంధన పెట్టి పారెస్తారు. దానితో సైన్సు ప్రాతిపదిక మీద రాసే కథలు, ఎడ్వంచర్ కథలు, రకరకాల అంశాలపై వ్యాసాలు, మొదలైన వాటికి పోటీలలో స్థానమే లేకుండా

పోతోంది. అమెరికాలో ఉన్న తెలుగు వాళ్ళల్లో 50 శాతం మించి వృత్తివ్యాపారాలలో ఉన్నవారే. వారు ముందు సైంటిస్టులు, డాక్టర్లు, ప్రోగ్రామర్లు, వ్యాపారస్తులు – తర్వాతే రచయితలు. వారి అనుభవాలని కథల రూపంలోనూ, వ్యాసాల రూపంలోనూ రాయొచ్చు. కానీ, ఇప్పటి ఫార్ములా వేలం వెర్రిగా మాండలికంలో రాయడం. మన సాహిత్యంలో మరి కొంచెం వైవిధ్యత ఉంటే బాగుంటుంది.

5. ఇలాగే ప్రతి ఏట సూవనీర్ పేరిట కనీసం 25 వేల డాలర్లు ఖర్చవుతోంది. ~~ఈ~~ సూవనీర్లు ఎంత మంది చదువుతున్నారు? డబ్బు ఇలా ఖర్చయినా పర్వాలేదు కాని తెలుగు సాహిత్యానికి ఒక ఎలక్ట్రానిక్ సూచిక తయారు చెయ్యడానికి ఒక్క సూవనీర్‌కి అయే ఖర్చు కంటె తక్కువ ఖర్చు అవుతుందని కలశపూడి శ్రీనివాసరావు ప్రతిపాదిస్తే ఎన్ని సంస్థలు ముందుకి వస్తున్నాయో లేదో నాకు తెలియదు.

6. మనందరికీ తెలుగు మీద "ఇంత" అభిమానం ఉన్నప్పటికీ, మన పిల్లలకి తెలుగు రావడం లేదు – ఇక్కడ

అమెరికాలోనే కాదు. అక్కడ ఇండియాలోనూ ఇదే పరిస్థితి. హిందీ వారు, గుజరాతీలు, తమిళులు, వారిపిల్లలకి వారిమాతృ భాష నేర్పుకోగలుగుతున్నారు. ఎందుకో మనమాపని చేయలేకపోతున్నాం.

7. అమెరికాలోని విశ్వవిద్యాలయాలలో తెలుగు పీఠం ఒకటి స్థాపించాలనే ఊహ ఊహామాత్రంగానే నిలచిపోయింది కాని క్రియారూపం దాల్చ లేదు. దీనికి (1) ఆర్థిక వనరులు విశేషంగా కావాలి, (2) ఏ ఊళ్ళో ఈ పీఠం స్థాపించాలి అన్న విషయంలో మనం అంతా ఒక తాటి మీద నిలబడి, అవగాహనకి రాగలగాలి. ఇది అంత సులభంగా జరిగే పని కాదు.
8. ఇల్లలకగానే పండుగ ఎలా కాదో , ఈ పీఠం స్థాపించినంత మాత్రాన సరిపోదు. నా అనుభవంలో – విశ్వవిద్యాలయపు స్థాయిలో "జనరల్ ఎడ్యుకేషన్ క్రెడిట్" ఇస్తామని ఊరించినా తెలుగు పిల్లలు తెలుగు నేర్చుకోడానికి సుముఖత చూపడం లేదు.

ఉదాహరణకి -- మూడేళ్ళబట్టి మా యూనివర్శిటీలో నేను తెలుగు నేర్పుతున్నాను. జనరల్ ఎడ్యుకేషన్ క్రెడిట్ ఇస్తారు. క్లాసు పరిమితి 15 అయితే 30 మంది వరకు ప్రవేశానికి ప్రతీక్షిస్తున్నారు. ఇప్పటికి 90 మంది నేర్చుకున్నారు. ఈ 90 మంది లో ఉరమరగా 10 మందే భారతీయులు! ఒకే ఒక్క తెలుగు పిల్ల!!

తెలుగు భాష అనే ప్రమిదలో ప్రతి తరం వారూ తమ వంతుగా ఇంత చమురు పోస్తూ ఉంటేనే ఈ దీపం రెపరెపలాడి ఘనమై పోకుండా తెలుగు తేజాన్ని విస్తరింపజేస్తుంది. అంతే కానీ, ఈ పాశ్చాత్య ప్రభంజనపు గాలిలో దీపాన్ని పెట్టి, "దేవుడా! నీదే భారమని" వదిలేయడం విజ్ఞత అనిపించుకోదు. మీరు కూడా ఆలోచించి చూడండి.

నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఈ కార్యక్రమం కార్యకర్తలందరికీ ధన్యవాదాలు!

నమస్కారం!!